JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రభాత జయభేరి

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి | శనివారం 13-06-2026
Medchal - Malkajgiri | Saturday 13-06-2026
Follow: jayabherinews
సంపుటి : 03 | సంచిక : 12
పేజీలు : 8 | వెల : 5
Vol. 03 | Issue 12 | Pages : 8 | ₹: 5

## విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889
call me
jayabheripaper@gmail.com





2 లో

## ముందుంది కష్ట కాలం


- రాష్ట్రాలను హెచ్చరించిన ప్రధాని నరేంద్ర మోదీ



2 లో

## మేము ఎవరికి గులాంలము కాదు..

- మా నిర్ణయాలు మేము తీసుకోగలం
- మోదీ నాయకత్వంలో అత్యంత వేగంగా దేశం అభివృద్ధి




హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మరో ముఖ్యమైన అడుగు వేసింది. అసెంబ్లీ భవనం వెనుక భాగంలో సుమారు 1.5 కిలోమీటర్ల పొడవున 'వై' (Y) ఆకారంలో కొత్త ఫ్లైఓవర్ నిర్మించాలని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టు పబ్లిక్ గార్డెన్స్ నుంచి లక్డీకాపూల్ వరకు విస్తరించి, నాంపల్లి-అసెంబ్లీ-లక్డీకాపూల్ మార్గంలో ఉండే రద్దీని గణనీయంగా తగ్గించనుంది.

ఈ చొరవ హైదరాబాద్ నగర అభివృద్ధిలో మరో మైలురాయి అవుతుందని నగర నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ట్రాఫిక్ నిర్వహణ మెరుగుపడటంతో పాటు, ప్రయాణ సమయం ఆదా అవుతుంది.

## ఆ మార్గంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్

- వై ఆకారపు భారీ ఫ్లై ఓవర్..
- వై ఆకారపు కొత్త ఫ్లై ఓవర్.. ఈ రూట్ లోనే
- 99 శాతం పనులు ప్రభుత్వ భూములపైనే
- హైదరాబాద్ కోర్ సిటీలో ట్రాఫిక్ కష్టాలకు చెక్
- ట్రాఫిక్ నిర్వహణ మెరుగుపడటంతో పాటు, ప్రయాణ సమయం ఆదా

జయభేరి, హైదరాబాద్ :

ప్రస్తుతం కోర్ సిటీలోని ఈ ప్రాంతాల్లో ముఖ్యంగా అసెంబ్లీ సమావేశాల సమయంలో వాహనాల రద్దీ తీవ్రంగా ఉంటుంది. హైదరాబాద్ విజయవాడ రహదారి అనుసంధానం కారణంగా భారీ వాహనాల రాకపోకలు కూడా ట్రాఫిక్ జామ్‌లను పెంచుతున్నాయి. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని హెచ్ఎండీఏ అధికారులు ఈ కొత్త వంతెన ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ ఫ్లైఓవర్ నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ప్రాంతం నుంచి మొదలై, పబ్లిక్ గార్డెన్ పైనుంచి అసెంబ్లీ వెనుక భాగం గుండా రైల్వే లైన్ వెంబడి ముందుకు సాగుతుంది. లక్డీకాపూల్ జంక్షన్ దగ్గరకు చేరుకున్న తర్వాత ఈ వంతెన రెండు భాగాలుగా విభజించబడి 'వై' ఆకారం తీసుకుంటుంది. ఒక భాగం మాసబ్ ట్యాంక్ వైపు,

...మిగతాది 2 లో

## గ్రామీణ ప్రాంతాలకు తీపికబురు



- ఇక మీ ఊరిలోనే అన్ని రకాల ప్రభుత్వ సేవలు
- 908 పిఎసిఎస్ కేంద్రాలు త్వరలోనే డిజిటల్ సేవా కేంద్రాలు
- మల్టీ-సర్వీస్ సెంటర్లుగా పీఏసీఎస్ కేంద్రాలు
- తెలంగాణలోని సహకార రంగానికి సరికొత్త జవసత్వాలు

జయభేరి, హైదరాబాద్ :

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు శుభవార్త. పట్టణాలలో మీ సేవా కేంద్రాల చుట్టూ సర్టిఫికెట్ల కోసం, పాన్ కార్డ్ ల దరఖాస్తుల కోసం తిరిగే బాధ తప్పేలా తెలంగాణా ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. తెలంగాణలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ మరియు డిజిటల్ సేవలను మరింత చేరువ చేసేందుకు తెలంగాణా ప్రభుత్వం ఒక విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 908 పిఎసిఎస్ కేంద్రాలను త్వరలోనే డిజిటల్ సేవా కేంద్రాలుగా మార్చనున్నారు. దీని ద్వారా పల్లెటూళ్లలో నివసించే ప్రజలు ఆధార్, పాన్ కార్డ్ మరియు ఇతర ముఖ్యమైన ప్రభుత్వ పథకాల సేవల కోసం సుదూర ప్రాంతాలలోని పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది. ఈ నూతన విధానం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడమే కాకుండా, రైతులకు, స్థానిక ప్రజలకు సమయం, డబ్బు ఆదా అవుతాయి.

...మిగతాది 2 లో



2 లో

## నిలిచిపోయిన మెడికల్ బోర్డును అతి త్వరలో ప్రారంభం

సింగరేణిలో వివిధ కారణాలతో కొద్దికాలంగా నిలిచిపోయిన మెడికల్ బోర్డును అతి త్వరలో ప్రారంభించాల్సిందిగా డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మెడికల్ బోర్డు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా, వివాదరహితంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు.




## డీలిమిటేషన్ తో జరిగేది ఇదే.. కేటీఆర్

జయభేరి, హైదరాబాద్ :

కాంగ్రెస్ లో సంచలనంగా మారిన మీనాక్షి నటరాజన్ వ్యవహారం పై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేసారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిదానికి సిట్ వేస్తుంది కదా.. ఆ పార్టీ నాయకురాలు మీనాక్షి నటరాజన్ అంశంపైన కూడా సిట్ వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీజేపీలో ఎవరికి ఫ్రెండ్స్ ఉన్నారో మీనాక్షి నటరాజన్ అంటే ఎవరికి కోపం ఉందో వాళ్లే కేసు గురించి ఎన్నికల కమిషన్‌కు చెప్పి ఉంటారని వ్యాఖ్యానించారు. తాజాగా చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాల పై కేటీఆర్ స్పందించారు. మీడియాతో చిట్ ఛాట్ లో ఈ వ్యాఖ్యలు చేసారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీలో ఉన్న 'బ్లాక్ షీప్' (పార్టీ ద్రోహులు) ఎవరో కనుక్కోవాలి. కాంగ్రెస్ పార్టీ అంటేనే కంపు. అలాంటి కాంగ్రెస్ కంపులో ద్రోహాల పార్టీ అంశంలో మమ్మల్ని ఎందుకు లాగుతున్నారని ప్రశ్నించారు. మీనాక్షి నటరాజన్ అంటే పడని వారే ఈ పని చేశారు. మీనాక్షి నటరాజన్‌కి తెలంగాణ కాంగ్రెస్‌లో ఎవరు వ్యతిరేకులో

...మిగతాది 2 లో

## తిరుపతిలో భారీ సభ

- ఏపీలో కూటమికి రెండేళ్ళు
- భవిష్యత్ ప్రణాళికలను చెప్పే ప్లాన్
- ప్రత్యేక స్టాల్స్... 30 వేల మందికి పైగా కూటమి శ్రేణులు
- ఆ నగరాల్లోనూ ప్రగతి సభలకు ప్లాన్
- చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రొగ్రెస్ రిపోర్ట్



జయభేరి, తిరుపతి :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తమ విజయవంతమైన రెండేళ్ల పాలనను పురస్కరించుకుని ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో జూన్ 12 ఒక భారీ బహిరంగ సభను ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టింది. "2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం" అనే ప్రధాన నినాదంతో ఏర్పాటు చేసిన ఈ వేదికపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీకి చెందిన అగ్రనేతలు ఉమ్మడిగా హాజరుకానున్నారు. కూటమి ప్రభుత్వం సాధించిన ప్రగతి ప్రజల వద్దకు గత 24 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన మైలురాళ్లు, ప్రవేశపెట్టిన విప్లవాత్మక పథకాలు, భవిష్యత్తు ప్రణాళికలను ఈ సభ ద్వారా ప్రజల ముందుకు తీసుకురానున్నారు. ఈ రెండేళ్ల కాలంలో సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణ పనులు,

...మిగతాది 2 లో




## రూ.11కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుబడిన మోడల్

జయభేరి, కేరళం :

మోడల్, Mrs కేరళం 2025 రన్నరప్ హర్షా సన్నీ డ్రగ్స్ స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడ్డారు. నిన్న రాత్రి బ్యాంకాక్ నుంచి ముంబై ఎయిర్పోర్టుకు వచ్చిన ఆమె కదలికలు అనుమానాస్పదంగా ఉండటాన్ని కస్టమ్స్ అధికారులు గుర్తించారు. ఆమె ట్రాలీ బ్యాగును తనిఖీ చేయగా వ్యాక్యూమ్ సీల్ చేసి ఉన్న 11కే జీల డ్రగ్స్ బయటపడ్డాయి. వాటి విలువ రూ. 11.82CR ఉంటుందని అధికారులు చెప్పారు. దీంతో ఆమెను అరెస్ట్ చేయగా కోర్టు రిమాండ్ విధించింది.

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఆ మార్గంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్

మరొక భాగం ఖైరతాబాద్ వైపు వెళ్లే రహదారులతో అనుసంధానం అవుతుంది. ఈ ఏర్పాటు వల్ల నాంపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలు సిగ్నల్ లేకుండా సులభంగా ముందుకు వెళ్లవచ్చు. ఈ ఫ్లైఓవర్‌ను పూర్తిగా వన్‌వే గా అమలు చేయనున్నారు. అంటే నాంపల్లి నుంచి వెళ్లే వాహనాలకు మాత్రమే ఉపయోగపడుతుంది. ఈ ప్రాజెక్టు యొక్క ప్రత్యేకత ఏమిటంటే, దాదాపు 99 శాతం పనులు ప్రభుత్వ భూములపైనే జరగనున్నాయి. భూసేకరణ సమస్యలు, కోర్టు కేసులు, పరిహార వివాదాలు ఎదుర్కొనవలసిన అవసరం లేకుండా హెచ్‌ఎండీఏ చాలా జాగ్రత్తగా డిజైన్ సిద్ధం చేసింది.
ఇది ప్రాజెక్టు వేగంగా పూర్తి కావడానికి దోహదపడుతుంది. ఈ కొత్త ఫ్లైఓవర్ అందుబాటులోకి వచ్చిన తర్వాత హైదరాబాద్ కోర్ సిటీలో రోజువారీ ప్రయాణం చేసే వాహనదారులు ఎంతో సౌకర్యం పొందుతారు. ముఖ్యంగా అసెంబ్లీ సమావేశాల సమయంలో విధించే ట్రాఫిక్ ఆంక్షల ప్రభావం తగ్గి, సాధారణ ప్రయాణాలు సాఫీగా జరుగుతాయి. హెచ్‌ఎండీఏ అధికారులు ఇప్పటికే సైట్ సర్వేలు పూర్తి చేసి, డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం చేస్తున్నారు. ఈ చొరవ హైదరాబాద్ నగర అభివృద్ధిలో మరో మైలురాయి అవుతుందని నగర నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ట్రాఫిక్ నిర్వహణ మెరుగుపడటంతో పాటు, ప్రయాణ సమయం ఆదా అవుతుంది. ఇది వాహనదారుల ఆరోగ్యం, ఇంధన వినియోగం తగ్గడం వంటి అనేక ప్రయోజనాలను కల్పిస్తుంది. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా మార్చే దిశగా ఈ రకమైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే నాంపల్లి నుంచి లక్డీకాపూల్ వరకు ప్రయాణం సాఫీగా సాగుతుంది.

## గ్రామీణ ప్రాంతాలకు తీపికబురు

ఈ సేవా కేంద్రాల ద్వారా లభించే ముఖ్యమైన సేవలలో నూతన ఆధార్ నమోదు, ఆధార్ కార్డులలో తప్పుల సవరణ మరియు అప్‌డేట్ సేవలు స్థానికంగానే అందుబాటులోకి వస్తాయి. అలాగే కొత్త పాన్ కార్డుల దరఖాస్తు, పాన్‌ఆధార్ అనుసంధాన ప్రక్రియలను ఇక్కడే పూర్తి చేసుకోవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ రకాల సంక్షేమ పథకాలకు సంబంధించిన దరఖాస్తులను ఈ కేంద్రాల ద్వారా సులభంగా సమర్పించవచ్చు. డిజిటల్ చెల్లింపులు, ఇన్సూరెన్స్ ప్రీమియంల చెల్లింపు, మరియు చిన్న తరహా బ్యాంకింగ్ లావాదేవీలను పీఏసీఎస్ పరిధిలోనే నిర్వహించుకునే వీలుంటుంది.
**రైతులకు ప్రయోజనాలు:** వ్యవసాయ రుణాలతో పాటు, పీఏసీఎస్ కేంద్రాలు ఇప్పుడు మల్టీసర్వీస్ సెంటర్లుగా మారడం వల్ల విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లతో పాటు అవసరమైన డిజిటల్ పత్రాలను ఒకే చోట పొందే అవకాశం లభిస్తుంది. ఈ డిజిటల్ పరివర్తన ప్రక్రియ ద్వారా తెలంగాణలోని సహకార రంగానికి సరికొత్త జవసత్వాలు లభించనున్నాయి. పల్లెల్లోనే ఆధునిక సాంకేతిక సేవలు అందుబాటులోకి రావడం వల్ల గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. సాంకేతిక పరిజ్ఞానం లేని సాధారణ పౌరులు కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ అధికారిక సేవలను పారదర్శకంగా వినియోగించుకోవడానికి ఈ 908 పీఏసీఎస్ కేంద్రాలు వేదికగా నిలుస్తాయి.

## డీలిమిటేషన్ తో జరిగేది ఇదే కేటీఆర్

ప్రజలందరికీ తెలుసన్నారు. కాంగ్రెస్ పార్టీలో పదవులు, డబ్బులకే వస్తున్నాయని షబ్బీర్ అలీ చెప్పినం దుకు అభినందనలని పేర్కొన్నారు షబ్బీర్ అలీ ఇప్పటికైనా ఉన్న వాస్తవాన్ని ప్రజల ముందు గట్టిగా చెప్పారని వ్యాఖ్యానించారు. అసలు గతంలో పీసీసీ పదవిని పైసలకు అమ్ముకున్నది కాంగ్రెస్ పార్టీనేనని.. ఆ తర్వాత ముఖ్యమంత్రి పదవిని కూడా డబ్బులకే అమ్ముకున్నదని ఆరోపించారు.
**ఫ్యూచర్ సిటీ పై కీలక వ్యాఖ్యలు**
రేవంత్ రెడ్డి పేమెంట్ కోటా సీటు అన్న విషయం అందరికీ తెలుసని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రతి నెలా డబ్బుల మూట పంపితేనే ఆయన పదవి ఉంటుందని ఎద్దేవా చేసారు. రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు, రెన్యూవల్ సీఎం అని అందరికీ తెలుసన్నారు. ఎయిర్ పోర్టు మెట్రో పూర్తయితే ఇంత ట్రాఫిక్ ఉండదు, కానీ ఆ ప్రాజెక్టు రేవంత్ రెడ్డి ఆపేశాడని ఆరోపించారు. ఉన్న నగరాన్ని గాలికి వదిలేసి ఫ్యూచర్ సిటీ అనడం ఏంటి? సీఎం రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ అని ఊహల్లో బతుకుతున్నాడని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌ను మరింతగా అభివృద్ధి చేస్తే సరిపోతుందన్నారు. రేవంత్ రెడ్డికే ఫ్యూచర్ లేదు ఇంకా ఫ్యూచర్ సిటీ ఎంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ అసమర్థ పాలనతో రాష్ట్రం 40 ఏండ్లు వెనక్కి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మొన్నటి ఒక్క వర్షానికే నగరం చెరువులను తలపించిందని విమర్శించారు.

## తిరుపతిలో భారీ సభ

పోలవరం ప్రాజెక్టు పునరుద్ధరణ, పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తూ కొత్త పెట్టుబడులను ఆకర్షించడం వంటి కీలక అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించింది. సంక్షేమాన్ని, ఆర్థికాభివృద్ధిని సమతూకంతో ముందుకు తీసుకెళ్తున్నామని చాటిచెప్పేలా తమ 'ప్రోగ్రెస్ రిపోర్ట్ 'ను ఈ సభలో బహిర్గతం చేయనున్నారు. అంతేకాకుండా, రాబోయే మూడేళ్ల కాలంలో ఏపీని ప్రగతిపథంలో నడిపించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై ఇటు సీఎం, అటు డిప్యూటీ సీఎం దిశా నిర్దేశం చేయనున్నారు. ఈ మెగా ఈవెంట్ కోసం తిరుపతి పరిధిలో సుమారు 20 ఎకరాల సువిశాల స్థలంలో సభా ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.
పాలనాపరమైన సంస్కరణలు, వివిధ ప్రభుత్వ శాఖల పనితీరును మరియు లబ్ధిదారుల విజయగాథలను డిజిటల్ రూపంలో ప్రదర్శించేందుకు వీలుగా ఇక్కడ 20 ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని నలుమూలల నుండి దాదాపు 30 వేల మందికి పైగా కూటమి శ్రేణులు, సాధారణ ప్రజలు తరలివస్తారనే అంచనాతో అధికారులు ముందస్తుగా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. సభకు 2 వేల మంది పోలీసులతో బందోబస్తు, ట్రాఫిక్ మళ్లింపులు జిల్లా కలెక్టర్, ఎస్పీల ప్రత్యక్ష పర్యవేక్షణలో సుమారు రెండు వేల మంది పోలీసులతో కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు.
సభకు వచ్చే వారికి తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించారు. మరోవైపు, నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు చిత్తూరు, కడప, నెల్లూరు, చెన్నై తదితర మార్గాల నుంచి వచ్చే వాహనాలకు ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. ఆ నగరాల్లోనూ ప్రగతి సభలకు ప్లాన్ కాగా, ఈ తిరుపతి సభ విజయవంతం అయిన అనంతరం అమరావతి, విశాఖపట్నం నగరాల్లో కూడా ఇలాంటి భారీ ప్రగతి సభలను నిర్వహించేందుకు కూటమి నాయకత్వం యోచిస్తోంది. తమ పాలనలో ఏపీలో జరిగిన అభివృద్ధిని, భవిష్యత్ లో సాధించబోయే ప్రగతిని ప్రజల ముందు సగర్వంగా ఉంచనుంది.

## గంజాయి విక్రయిస్తూ ఇద్దరు యువకులు అరెస్ట్,

- 1.70 కిలోల గంజాయి స్వాధీనం, రిమాండ్ కి తరలింపు

**జయభేరి, మేడ్చల్ :**

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను మేడ్చల్ జిల్లా ఘట్ కేసర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం ఖమ్మం పట్టణానికి చెందిన ధనుష్, లోకేష్ అనే ఇద్దరు యువకులు గంజాయికి అలవాటు పడి, ఆంధ్రప్రదేశ్ నుంచి గంజాయి తీసుకువచ్చి ఘట్కేసర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ హాస్టల్లో ఉంటూ అవసరమైన వారికి విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించగా వారి వద్ద నుంచి 1 కిలో 70 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నిందితులను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి రిమాండ్కు తరలించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఘట్ కేసర్ ఇన్స్పెక్టర్ బాలస్వామి తెలిపారు.

# మేము ఎవరికి గులంలము కాదు

- మా నిర్ణయాలు మేము తీసుకోగలం
- మోదీ నాయకత్వంలో అత్యంత వేగంగా దేశం అభివృద్ధి

**జయభేరి, సికింద్రాబాద్ :**



కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్ తో భారతీయ జనతా పార్టీ ఏర్పాటుచేసిన మేధావుల సదస్సుకు హాజరైన మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత అనేక సందర్భాల్లో ఆయనతో ప్రత్యక్షంగా సమావేశాల్లో పాల్గొన్న జ్ఞాపకాలు నాకు ఉన్నాయి. ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో జీఎస్టీ సమావేశాలలో పాల్గొన్నాను. ఒకప్పుడు భారతదేశం ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంకులు వరల్డ్ బ్యాంకులో అప్పులు ఇస్తే తప్ప అభివృద్ధి చేయలేని దుస్థితి ఉండేది. నరేంద్ర మోదీ నాయకత్వంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. కాంగ్రెస్ పార్టీవి ఎప్పుడు ఎలక్షన్ ఓరియెంటెడ్ తప్ప పబ్లిక్ ఓరియంటెడ్ పాలసీలు లేవు. రెండోసారి ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత కూడా జిఎస్టిని అమలు చేయలేకపోయారు. ఒకే దేశం ఒకే పన్ను విధానం ఉండాలని నరేంద్ర మోడీ జీఎస్టీ ని అమలు చేసి చూపించారు. జీఎస్టీ అమలు కోసం 29 రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కమిటీ వేసి మమ్మల్ని స్టడీ కోసం ఆస్ట్రేలియాకు పంపించారు. మా దగ్గర టాక్స్ ని అమలు చేసిన ప్రభుత్వం ఓడిపోయింది, భారతదేశంలో అక్షరాస్యత తక్కువ, పన్ను కట్టే వారి సంఖ్య తక్కువ అలాంటి దేశంలో జీఎస్టీ ని ఎలా అమలు చేయగలుగుతారు అని మమ్మల్ని ప్రశ్నిస్తే మా ప్రధాని నిబద్ధతతో ఉన్నారు ఖచ్చితంగా అమలు చేసి తీరుతామని సమాధానం మేము వారికి చెప్పాము. నరేంద్ర మోడీ నిర్ణయాలు ఎంత బలంగా ఉంటాయో అనడానికి జీఎస్టీ అమలు ప్రత్యక్ష ఉదాహరణ. జిఎస్టి వసూళ్లు మొదటి నెలలో 73 వేల కోట్లు అయితే ఇప్పుడు అది నాలుగు లక్షల కోట్లకు చేరుకుంది. నేను వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్నప్పుడు కరోనా సమయంలో ప్రతి వారం నరేంద్ర మోడీతో వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొనే అవకాశం వచ్చింది.
కరోనాను తలుచుకుంటే దుఃఖం వస్తుంది. అమెరికా అధ్యక్షుడు, ఇరాన్ ప్రధాని, లండన్ ప్రెసిడెంట్ దేవుడా మా ప్రజలను కాపాడు అని మొక్కుకున్నారు. చైనాలో వచ్చింది కాబట్టి వారు తట్టుకోగలిగారు అదే భారతదేశంలో వస్తే శవాల గుట్టలుగా మిగులుతాయని చాలామంది మాట్లాడారు. కరోనా భయాన్ని పోగొట్టి ప్రజల్లో ధైర్యాన్ని నింపి కాపాడిన మహనీయుడు నరేంద్ర మోడీ. వ్యాక్సిన్ తయారుచేసి భారత దేశ ప్రజలకి కాకుండా పక్క దేశాలకు కూడా అందించిన ఘనత మనది. స్థిరమైన పాలనను, ప్రపంచ పటం మీద గుర్తింపును తీసుకొచ్చిన గొప్ప నేత నరేంద్ర మోడీ. మానవత్వం ఉన్న నాయకుడు కాబట్టి కరోనా సమయం నుంచి 80 కోట్ల మందికి మనిషికి ఐదు కేజీల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నారు. మేము ఎవరికి గులంలము కాదు మా నిర్ణయాలు మేము తీసుకోగలమని సగర్వంగా ప్రకటించిన నాయకుడు నరేంద్ర మోడీ.

# ముందుంది కష్ట కాలం

- రాష్ట్రాలను హెచ్చరించిన ప్రధాని నరేంద్ర మోదీ

**జయభేరి, న్యూఢిల్లీ:**



భారత్‌లో భవిష్యత్తులో ఎదురయ్యే వాతావరణ సవాళ్లపై ప్రధాని మోదీ రాష్ట్ర ప్రభుత్వాలను అప్రమత్తం చేశారు. నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో మాట్లాడిన ఆయన, ఎల్ నినో పరిస్థితులు ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్న నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దేశ అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని నిర్వహించిన నీతి ఆయోగ్ 11వ పాలక మండలి సమావేశంలో వాతావరణ మార్పులు ప్రధాన చర్చాంశంగా నిలిచాయి. ఈ సమావేశంలో పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు. భవిష్యత్తు తరాలకు నీటి భద్రత కల్పించాలంటే ఇప్పటి నుంచే సమర్థవంతమైన ప్రణాళికలు అమలు చేయాల్సిన అవసరం ఉందని ప్రధాని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. ప్రపంచ వాతావరణ సంస్థ (WMO) సహా పలు అంతర్జాతీయ వాతావరణ సంస్థలు 2026 మధ్యకాలంలో ఎల్ నినో ప్రభావం కనిపించే అవకాశాలు ఉన్నాయని ఇప్పటికే అంచనా వేశాయి. ఈ పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా వాతావరణ వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆసియా దేశాల్లో వర్షపాతం నమూనాలు మారిపోవడం, ఉష్ణోగ్రతలు పెరగడం వంటి పరిస్థితులు తలెత్తే అవకాశాలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు.
ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర జలాల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల ఏర్పడే వాతావరణ పరిస్థితి. దీని ప్రభావం ప్రపంచంలోని అనేక దేశాలపై కనిపిస్తుంది. భారతదేశంలో అయితే ఇది రుతుపవనాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. సాధారణంగా ఎల్ నినో ప్రభావం పెరిగిన సంవత్సరాల్లో వర్షపాతం తగ్గడం, వడగాలులు అధికమవడం, కొన్ని ప్రాంతాల్లో కరవు పరిస్థితులు ఏర్పడటం వంటి సమస్యలు కనిపిస్తాయి. వ్యవసాయ రంగంపై కూడా దీని ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉంటుంది.
భవిష్యత్తులో నీటి కొరత సమస్యలను ఎదుర్కోవాలంటే ఇప్పటి నుంచే నీటి సంరక్షణ చర్యలను వేగవంతం చేయాలని ప్రధాని రాష్ట్రాలకు సూచించారు. వర్షపు నీటిని నిల్వ చేసే వ్యవస్థలను విస్తరించడం, భూగర్భ జలాలను పరిరక్షించడం, సాగునీటిని సమర్థంగా వినియోగించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి నిర్వహణకు సంబంధించి కొత్త విధానాలు రూపొందించాలని కూడా సూచించారు.



# నిలిచిపోయిన మెడికల్ బోర్డును అతి త్వరలో ప్రారంభం

**జయభేరి, హైదరాబాద్ :**

సింగరేణిలో వివిధ కారణాలతో కొద్దికాలంగా నిలిచిపోయిన మెడికల్ బోర్డును అతి త్వరలో ప్రారంభించాల్సిందిగా డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మెడికల్ బోర్డు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా, వివాదరహితంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు.
సింగరేణి అభివృద్ధిపై ఇటీవల కోల్ బెల్ట్ ప్రాంత శాసన సభ్యులు, మంత్రులతో నిర్వహించిన సమావేశం సందర్భంగా మెడికల్ బోర్డు అంశాన్ని వారు తన దృష్టికి తీసుకువచ్చారని డిప్యూటీ సీఎం అన్నారు. ఈ అంశంపై కార్మికుల ఆందోళనలను వివరించారని చెప్పారు. ఆ సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి, కార్మికుల ప్రయోజనాలను కాపాడే దిశగా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. మెడికల్ బోర్డు ప్రక్రియ ద్వారా నిజంగా అర్హులైన ఉద్యోగులకు మాత్రమే ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా వారి వారసులకు కారుణ్య నియామకాల రూపంలో ఉపాధి అవకాశాలు కల్పించాలని డిప్యూటీ సీఎం సూచించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు, అవకతవకలు, మోసాలకు తావులేకుండా కట్టుదిట్టమైన వ్యవస్థను అమలు చేయాలని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమం విషయంలో ప్రజా ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని, మెడికల్ బోర్డు ప్రక్రియపై పూర్తి విశ్వాసం ఉంచి, యాజమాన్యానికి సహకరించాలని కార్మికులకు సూచించారు. రాబోయే రోజుల్లో కూడా సింగరేణిని బహుముఖంగా విస్తరించేందుకు, కొత్త బొగ్గు బ్లాక్లు సాధించేందుకు తద్వారా ఉద్యోగుల వారసులకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతాయని డిప్యూటీ సీఎం అన్నారు. ఒడిశా నైనీ బ్లాక్ అనుమతులతోపాటు బొగ్గు ఉత్పత్తికి ప్రజా ప్రభుత్వంలో తీసుకున్న ప్రత్యేక చొరవను డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా గుర్తుచేశారు.

# ఆధునిక భారతంలో అమానవీయ కోణం

**మురికికూపాల్లో ఆగుతున్న పారిశుధ్య కార్మికుల ఊపిరి..**

**యంత్రాలొచ్చినా మారని మనుషుల రాత.. గడిచిన ఐదేళ్లలో 350కిపైగా మంది మృతి**

**జయభేరి, హైదరాబాద్ :**

సాంకేతిక రంగంలో భారత్ అగ్రగామిగా దూసుకుపోతున్న వేళ, పారిశుధ్య కార్మికుల ఊపిరి మాత్రం మురికికూపాల్లోనే ఆగిపోతుండటం సమాజాన్ని ప్రశ్నిస్తోంది. ఇటీవల గుజరాత్‌లోని సూరత్ నగరంలో ఓ జ్యువెలరీ తయారీ యూనిట్‌కు చెందిన సెప్టిక్ ట్యాంక్‌ను క్లీన్ చేస్తూ, ఎలాంటి రక్షణ పరికరాలు లేకపోవడంతో విష వాయువులు పీల్చి నలుగురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోవడం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ దారుణ ఉదంతం పారిశుధ్య రంగంలో నెలకొన్న ఘోరమైన నిర్లక్ష్యాన్ని, మానవ ప్రాణాలకు ఇస్తున్న విలువను మరోసారి సమాజం ముందు నగ్నంగా నిలబెట్టింది. మల విసర్జితాలను చేతులతో ఎత్తడాన్ని, మానవ ప్రమేయంతో సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేయడాన్ని చట్టం పూర్తిగా నిషేధించినప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలవుతున్న తీరు మాత్రం శూన్యమని ఈ ఘటనే నిరూపిస్తోంది.
ఈ పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సవాళ్లు కేవలం ఒక రోజుతో ముగిసేవి కావు. వారి రోజువారీ జీవితం నిత్యం మృత్యువుతో పోరాటమే. భూగర్భంలో ఉండే సెప్టిక్ ట్యాంకులు, మురుగునీటి కాల్వలలో ఏళ్ల తరబడి పేరుకుపోయిన వ్యర్థాల వల్ల హైడ్రోజన్ సల్ఫైడ్, మీథేన్, కార్బన్ మోనాక్సైడ్ లాంటి ప్రాణాంతకమైన విష వాయువులు గుమికూడుతాయి. కనీస ఆక్సిజన్ కూడా అందని ఆ ఇరుకైన గుంతల్లోకి కార్మికులు దిగిన వెంటనే, ఆ గ్యాస్ ప్రభావంతో నిమిషాల వ్యవధిలోనే స్పృహ తప్పి ఊపిరాడక చనిపోతున్నారు విషవాయువుల ముప్పు ఒకెత్తయితే, ఈ మురికి నీటి వల్ల వచ్చే చర్మవ్యాధులు, శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు, కాలేయ సంబంధిత జబ్బులు వారి జీవిత కాలాన్ని సగానికిపైగా తగ్గించేస్తున్నాయి. సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలవారే ఈ వృత్తిలోకి నెట్టబడటం వెనుక తీవ్రమైన వివక్ష దాగి ఉంది. పార్లమెంటులో ప్రభుత్వం సమర్పించిన వివరాల ప్రకారం.. నమస్తే పథకం కింద గుర్తించబడిన పారిశుధ్య కార్మికులలో దాదాపు 92 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చెందినవారే కావడం గమనార్హం. కేవలం పేదరికం, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్లే వీరు ప్రాణాలను పణంగా పెట్టి ఈ నరకకూపాల్లోకి దిగుతున్నారు. మానవ హక్కుల సంఘాలు నెత్తీనోరు బాదుకుంటున్నా, సమాజం వారిని కేవలం 'అదృశ్య కార్మికులు'గానే చూస్తోంది తప్ప, వారి శ్రమకు దక్కాల్సిన కనీస గౌరవాన్ని ఇవ్వడం లేదు.



భారతదేశంలో గడిచిన ఐదేళ్ల గణాంకాలను పరిశీలిస్తే ఈ మరణాల తీవ్రత ఎంత భయానకంగా ఉందో అర్థమవుతుంది. ప్రభుత్వ అధికారిక రికార్డుల ప్రకారం.. గత ఐదు సంవత్సరాలలో దేశవ్యాప్తంగా సెప్టిక్ ట్యాంకులు, మురుగునీటి లైన్లు శుభ్రం చేస్తూ సుమారు 350కి పైగా కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. అయితే సఫాయి కర్మచారి ఆందోళన్ వంటి స్వచ్ఛంద సంస్థల అంచనాల ప్రకారం.. క్షేత్రస్థాయిలో నమోదైన వాస్తవ మరణాల సంఖ్య దీనికి రెండింతలు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. దేశంలో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, హర్యానా, గుజరాత్ రాష్ట్రాలు పారిశుధ్య కార్మికుల మరణాలలో మొదటి ఐదు స్థానాల్లో నిలవడం ఆందోళనకరం. చనిపోయిన కొన్ని కుటుంబాలకు రూ. 10 లక్షల పరిహారం అందుతున్నప్పటికీ, మరికొన్ని కుటుంబాలు చట్టపరమైన చిక్కుల వల్ల ఆ సాయానికి కూడా నోచుకోక రోడ్డున పడుతున్నాయి.
ఈ అమానవీయ పద్ధతికి చరమగీతం పాడాలంటే కేవలం చట్టాలు చేస్తే సరిపోదు, బలమైన రాజకీయ చొరవ మరియు సాంకేతిక మార్పు అవసరం. 'పారిశుధ్య కార్మికుల ఉపాధి నిషేధం వారి పునరావాస చట్టం2013'ను ఉల్లంఘించి, కార్మికులను ట్యాంకుల్లోకి దింపే ప్రైవేట్ వ్యక్తులు, ఏజెన్సీలపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలో రోబోటిక్ క్లీనింగ్ యంత్రాలను అందుబాటులోకి తెచ్చి, వంద శాతం యాంత్రీకరణ వైపు అడుగులు వేయాలి. మానవ వ్యర్థాలను మనుషులే క్లీన్ చేసే దుస్థితిని రూపుమాపినప్పుడే భారతదేశం నిజమైన సామాజిక సమానత్వం వైపు ప్రయాణించగలదు.

.....బాలు జాజాల

# వర్షా కాలం దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

- పైడే డ్రై డే కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 12 :**





వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పిలుపునిచ్చారు. పురపాలక పరిసరాల పరిశుభ్రతదోమల నివారణకై యాదగిరిగుట్టలో ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. యాదగిరిగుట్ట పట్టణంలోని 7వ వార్డులో జరిగిన కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పాల్గొని వార్డులను పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు,పరిసరాల పరిశుభ్రతపైన స్థానికులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు జిల్లా వైద్యారోగ్య,పురపాలక సంయుక్తంగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వేసవి కాలం నుంచి వర్షాకాలంలోకి మారే సమయాల్లో దోమలు వృద్ధి చెంద కుండా ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్లలో కూలర్లు,పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, పూలకుండీల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఎక్కడా మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ఇళ్లలో దోమలు కుట్టకుండా రాత్రి వేళల్లో దోమతెరలు వాడాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మున్సిపల్ ఛైర్మన్ గుండ్లపల్లి వాణిభరత్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, వైస్ చైర్పర్సన్ బరిగే రమ్యారాంచందర్, కౌన్సిలర్లు పెలిమెల్లి లావణ్య శ్రీధర్, బోడ రాధసురేష్, కాటబత్తిని స్వప్నఆంజనేయులు, పేరబోయిన సత్యనారాయణ, బబ్బూరి శ్రీధర్, బిట్టు సరోజ హరీష్, బూడిద మధు, ముఖ్యర్ల మల్లేష్ యాదవ్, బబ్బూరి శ్రీధర్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రహిమా సలాం, బండి జంగమ్మ, షేక్ ఉస్మాన్ షరీఫ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పావని, శానిటరీ ఇన్స్ పెక్టర్, సురేందర్ తో పాటు మున్సిపల్,వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు వినతిపత్రం అందజేసిన యాదగిరిగుట్ట మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్లు

**జయభేరి, యాదగిరిగుట్ట :**



యాదగిరిగుట్ట పట్టణ అభివృద్ధి కోసం రూ.50 కోట్ల నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను యాదగిరిగుట్ట మున్సిపల్ పాలక మండలి సభ్యులు కోరారు. శుక్రవారం యాదగిరిగుట్ట పట్టణాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని బీర్ల అయిలయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్,కౌన్సిలర్లు మాట్లాడుతూ యాదగిరిగుట్ట పట్టణ అభివృద్ధిలో భాగంగా సీసీ రోడ్లు,డ్రైనేజీ,స్మశాన వాటిక అభివృద్ధి,సోలార్ విధి దీపాలు, పట్టణంలో స్వాగత తోరణాలతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.50 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మున్సిపల్ ఛైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్,వైస్ ఛైర్మన్ బరిగే రమ్య రామచందర్, మున్సిపల్ కౌన్సిలర్లు బోడ రాధసురేష్, బూడిద మధు, కాటబత్తిని స్వప్న ఆంజనేయులు, మాలోతు సరోజ హరీష్, కర్రె మాధవి ప్రవీణ్, పెలిమెల్లి లావణ్య శ్రీధర్, పేరబోయిన సత్యనారాయణ, సాధునేని ధనలక్ష్మిమధుకర్, ముక్కెర్ల మల్లేష్, బబ్బూరి శ్రీధర్, కోఆప్షన్ సభ్యులు బండి జంగమ్మ శ్రీశైలం, గౌలీకార్ అరుణరాజేష్, ఎండి రహిమ సలాం, షేక్ ఉస్మాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత


- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్
- కొత్తకోటలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 2కే రన్
- హాజరైన, పోలీసు రెవెన్యూ అధికారులు

**జయభేరి, దేవరకద్ర :**






డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో డ్రగ్స్ కు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా శుక్రవారం వనపర్తి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 2 కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలీసు, రెవెన్యూ ఉన్నత అధికారులతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి జిఎంఆర్ ప్రసంగించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన మన అందరి బాధ్యత అని ఆయన అన్నారు.డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్ కోసం బాటలు వేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఒకప్పుడు విదేశాలకు పరిమితమైన డ్రగ్ సంస్కృతి, మన ప్రాంతాలకు వ్యాపించిందన్నారు. డ్రగ్స్ బారిన పడి యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తపరిచారు. డ్రగ్స్ కు బానిసలై కొంతమంది యువత ఆత్మహత్యలకు సైతం పాల్పడుతు న్నారన్నారు. గతంలో డ్రగ్స్ వ్యాప్తి ఉధృతంగా ఉండేది, దానిని కంట్రోల్ చేసేందుకు, డ్రగ్స్ ను అరికట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో ఉన్న నార్కోటిక్ బ్యూరోను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి, పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి ఈగల్ ఫోర్సును ఏర్పాటు చేశారన్నారు. డ్రగ్స్ పై ప్రభుత్వం చేస్తున్న పోరాటంలో పౌరులుగా మనమందరం డ్రగ్స్ నిర్మూలనలో భాగమై, డ్రగ్స్ తీసుకుంటున్న వారి వివరాలను, డ్రగ్స్ విక్రయిస్తున్నారని సమాచారం తెలిసిన వెంటనే 1908 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం తెలియజేయాలన్నారు. డ్రగ్స్ పై సమాచారం ఇచ్చిన పౌరుల వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని ఎమ్మెల్యే అన్నారు.మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించిన పోలీస్ శాఖకు ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం సమాజాన్ని మానసికంగా, ఆర్థికంగా నాశనం చేస్తుంది, మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత, డ్రగ్ ఫ్రీ సొసైటీ కోసం అందరం కృషి చేద్దామన్నారు. అనంతరం ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవేర్నెస్ కార్యక్రమంలో కూడా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, యువకులు, మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## దేవాలయం పూజారి దంపతులకు ఒడిబియ్యం

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర లో కొలువుదీరిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రధాన అర్చకులు హరి శంకర శర్మ దంపతులకు జేష్ఠ మాసం అధికమాసం సందర్భంగా శుక్రవారం రాత్రి స్థానిక ఆర్యవైశ్య మహిళలు ఒడిబియ్యం నింపే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఏడాది ప్రధాన అర్చకుడి దంపతులకు సాంప్రదాయ రీతిలో ఒడి బియ్యం నింపే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి స్థానిక ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## వాసవి మాత అమ్మవారికి ఆభరణాల బహుకరణ



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్రలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి స్థానికులు బిలకంటి మాధవి, రాఘవేంద్ర దంపతులు పట్టు వస్త్రాలు, ఆభరణాలను బహుకరించారు. ఈ సందర్భంగా వారిపై దేవస్థానం ప్రధాన అర్చకుడు హరిశంకర్ శర్మ అక్షింతలు చెల్లి ఆశీర్వచనం పలికారు. అమ్మవారి ఆశీస్సులు వారిపై ఎల్లవేళలా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.




## నూతన అధ్యక్షులుగా కాసర్ల సంపత్ ఏకగ్రీవం

**జయభేరి, సైదాపూర్ :**

కరీంనగర్ డెయిరీ దుద్దెనపల్లి గ్రామ పాల ఉత్పత్తి దారుల సంస్థలో "వార్షిక మహా సభ" సమావేశం నిర్వహించి నూతన అధ్యక్షులుగా కాసర్ల సంపత్, S/O రాజయ్యని పాలక వర్గ సభ్యులు అందరు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఇద్దరు పాలక వర్గ సభ్యులుగా ఏనుగుల రాములు, కాసర్ల శ్రీనివాస్ ను ఎన్నుకోవడమైనది. డెయిరీ రూట్ సూపర్వైజర్ తొంట ప్రకాష్, పాలకవర్గ సభ్యులు, సంస్థ కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్, టెస్టర్ గుళ్ల శ్రీనివాస్, సహాయకుడు సోమారపు సమ్మయ్య, పాల ఉత్పత్తి దారులు రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థిని చదువు కోసం సరోజ్ రెడ్డి ఆర్థిక సహాయం



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామానికి చెందిన గొల్ల బుచ్చన్న కూతురు డి ఎల్ టి కోర్సు చదువు కోసం శుక్రవారం దేవరకద్ర నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, హైకోర్టు న్యాయవాది మండడి సరోజ్ రెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన వడ్డే కృష్ణన్న ఇటీవల మరణించారు. దీంతో ఆ కుటుంబాన్ని సరోజ్ రెడ్డి పరామర్శించి వారికి కూడా ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

## దేవరకద్ర ఎస్ఐని సన్మానించిన చందూగౌడ్




**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్రకు నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ భాస్కర్ రెడ్డిని శుక్రవారం రాత్రి కోయిల్ సాగర్ చందు గౌడ్, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కు స్వీట్ తినిపించి శాలువా కప్పి సత్కరించారు.

## దేవరకద్ర ఎస్ఐ గా భాస్కర్ రెడ్డి



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నూతన ఎస్ఐ గా భాస్కర్ రెడ్డి శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన ఎస్ఐ నాగన్న భూత్పూర్ కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో భాస్కర్ రెడ్డి దేవరకద్ర ఎస్ఐ గా పదవి బాధ్యతలు చేపట్టారు. గతంలో భూత్పూర్, కోయిలకొండ, మహబూబ్ నగర్ రూరల్ ట్రాఫిక్ ఎస్ఐగా భాస్కర్ రెడ్డి విధులు నిర్వహించి అందరి మండల పొందారు. ఎస్ఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన భాస్కర్ రెడ్డిని పలువురు నాయకులు పోలీస్ స్టేషన్ కు వచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్ విషయంలో అందరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.



## ఫ్రైడే డ్రైడే శ్రమదాన కార్యక్రమం

జయభేరి, తుర్కపల్లి, జూన్ 12 :

తుర్కపల్లి మండలం వెంకటాపూర్ గ్రామంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కర్రె మాధవి కరుణాకర్ గౌడ్ వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇండ్లలోని నీటి ట్యాంకులు పాత డబ్బాలు, పాత్రల వంటి వాటిలో నిలువ ఉండే నీటిని పూర్తిగా తొలగించి శుభ్రపరచాలని అన్నారు .కూలర్లను తరచూ శుభ్రం చేయడం, కొబ్బరి చెక్కలు, పాత టైర్లు వంటి వ్యర్థాలను తొలగించడం ద్వారా దోమల పెరుగుదలను అరికట్టవచ్చని అన్నారు. గ్రామంలో పారిశుద్ధ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆరుట్ల ఉదయ్ రెడ్డి, కార్యదర్శి నవీన్, వార్డు సభ్యులు నారా నాగరాజు గౌడ్, గుంటి లావణ్య నాగరాజు, కొండపాక అక్షిత మహేష్, పల్లెపాటి అనిల్, ఆశా వర్కర్ వనజ, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన వంట కార్మికులతో సమావేశం




జయభేరి, తుర్కపల్లి, జూన్ 12 :

తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులకు మధ్యాహ్న భోజన వంట కార్మికులకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఆర్. శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాలలు పునర్ ప్రారంభం అయ్యేనాటికి సీసీహెచ్ లో కిచెన్ షెడ్లు, వంట పాత్రలు, వంటకు ఉపయోగించే నీటి ట్యాంకులు శుభ్రం చేసుకోవాలని, వంట వండుటకు కావలసిన దినుసులను తయారు చేసుకోవాలని, పాఠశాలకు హాజరయ్యే విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం తయారు చేయాలని తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మంజూషారాణి సందర్శించి ప్రధానోపాధ్యాయులకు సీసీహెచ్లకు తగు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన వంట కార్మికులు పాల్గొన్నారు.

## అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్ కు ఘన సన్మానం

- శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపిన నాగులపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు



జయభేరి, షాద్ నగర్, జూన్ 12 :

రంగా రెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన యంగ్ డైనమిక్ లీడర్ రాయికల్ శ్రీనివాస్ ను నాగులపల్లి కాంగ్రెస్ పార్టీ నేతలు శుక్రవారం శాలువాతో సన్మానించి పూల మాలవేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాగులపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.... పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికి చిన్న పెద్ద తేడా లేకుండా ఉన్నత పదవులను కాంగ్రెస్ పార్టీ అందించడం ఎంతో అభినందనీయమని అన్నారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించి పనిచేసే ప్రతి ఒక్కరికి పార్టీ ఎల్లవేళల అండగా ఉంటూ కార్యకర్త నుంచి ముఖ్య నేతల వరకు ప్రతి ఒక్కరిని కంటికి రెప్పలా కాపాడుకుంటుందని అన్నారు. శ్రీనివాస్ అంచలంచలుగా ఎదుగుతూ మరిన్ని ఉన్నతమైన పదవులలో రాణించాలని, నిరంతరం ప్రజలకు సేవ చేసే శ్రీనివాస్ కు మండల అధ్యక్ష పదవి రావడం ఎంతో గర్వకారణమని, ప్రజల అండంతో, ప్రజల ఆశీర్వాదంతో ఆయన మరిన్ని ఉన్నతమైన పదవులలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నందిమల రాములు గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు గడిగెల పాండు గౌడ్, బైరి దర్శన్ రెడ్డి , కమలాజీ నరసింహ చారి,బోడంపాటి శేఖర్, తూర్పాటి వెంకటేష్, జెయసింహ రెడ్డి, వార్డు సభ్యులు గోడల బౌరయ్య, వనరసి స్వామి, యువ నాయకుడు అన్నారం సతీష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పలు పనులను ప్రారంభించిన మంత్రి సీతక్క

జయభేరి, ములుగు :

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మల్లంపల్లి మండలం రామచంద్రాపురం గ్రామ పరిధిలోని సీఆర్ఆర్ 202526 నిధులు రూ.19 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డును, ఆర్అండ్బీ రోడ్డు నుంచి దుర్గా మాత టెంపుల్ వరకు సీఆర్ఆర్ 202526 నిధులు రూ.15 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును, అలాగే రూ.10 లక్షల డీఎంఎఫ్టీ నిధులతో నూతనంగా నిర్మించిన దుర్గామాత దేవాలయం కాంపౌండ్ వాల్ను రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. తరువాత రం కోయగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంత్రి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి మెగా శానిటేషన్ డ్రైవ్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ వికాస్ మీనా, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, డీఈఓ సిద్ధార్థ రెడ్డి, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి , ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి , గ్రామ సర్పంచ్ దొంతి స్వరూప , స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేతలు అసత్య వ్యాఖ్యలు మానాలి

- లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుని అధ్యయనం చేయడానికే అరుణమ్మ వచ్చింది
- ప్రాజెక్ట్ డిపిఆర్ తప్పిదాల వల్ల 'హోదా' సాధ్యం కాదని స్పష్టం చేసింది
- ప్రాజెక్టుపై చిత్తశుద్ధి ఉంటే ఎప్పటిలోగా పూర్తి చేస్తారో ప్రజలకు సమాధానం చెప్పండి
- విమర్శలు మాని ఇచ్చిన హామీలు అమలు చేయండి
- కేంద్ర నిధులతోనే గ్రామాల అభివృద్ధి
- గ్రామాలలో సర్పంచుల గౌరవాన్ని కాపాడుతుంది కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాదా?
- స్థాయి మరిచి అరుణమ్మను విమర్శించడం తగదు
- కొందుర్గు కాంగ్రెస్ నాయకులకు బిజెపి నాయకుల హితవు




జయభేరి, షాద్ నగర్, జూన్ 12 :

ఇటీవల వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనేందుకు కొందుర్గు ఉమ్మడి మండలానికి విచ్చేసిన పాలమూరు ఎంపీ డీకే అరుణమ్మ గారు మొదటిసారి లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించిన తర్వాత కొందుర్గు మండల కేంద్రంలో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టనున్న లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు గురించి కూలంకషంగా వివరించడం జరిగింది. 2013 సంవత్సరంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకి తాను మంత్రిగా ఉన్నప్పుడే జీవోలు ఇప్పించడం జరిగిందని, ఆ తర్వాత ఏర్పడిన టిఆర్ఎస్ ప్రభుత్వం డిపిఆర్లు మార్చి ప్రాజెక్టు చేపట్టిందని, డిపిఆర్లలో పలు రకాల మార్పులు చేయడం వల్ల పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకి జాతీయ హోదా ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. దీనిని గ్రహించని స్థానిక కాంగ్రెస్ నాయకులు తమ స్థాయిని మించి మాట్లాడడం సమంజసం కాదని బిజెపి సీనియర్ నాయకులు మంగన్నగారి బలవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ నాయకులు కారు కూతలు మాని జాతీయ హోదా అంటే ఏమిటో అర్థం తెలుసుకోవాలని సూచించారు. ఆరు గ్యారెంటీల పేరుతో అడ్డగోలు హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయక బిజెపిని విమర్శించడం ఆకాశంపై ఉమ్మి వేయడమే అని అన్నారు. విమర్శలు మాని ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంత రెడ్డి మాట్లాడుతూ, గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధుల ద్వారానే అని పేర్కొన్నారు. గ్రామాల పట్ల చిత్తశుద్ధి ఉంది కాబట్టే కేంద్ర బిజెపి ప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరు చేసి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని పేర్కొన్నారు మండలంలో చేపడుతున్న గ్రామపంచాయతీ భవనాలు, అంగన్వాడీ భవనాలు, మహిళా సమాఖ్య భవనాల నిధులు కేంద్ర ప్రభుత్వానివి కావా? అని ప్రశ్నించారు.

లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు ఎప్పటిలోగా పూర్తి చేస్తారో ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. అభివృద్ధి కోసం ఎంపీ గారితో కలిసి ముందుకు సాగాలే తప్ప, ఏదో ఎంపీ గారు మండలానికి వచ్చినందుకు తూతూ మంత్రంగా ప్రెస్ నోట్ రాసి ఎంపీ గారి మీద బురద చల్లాలని చూస్తే ఖబర్దార్ అని హెచ్చరించారు. జిల్లేడు చౌదరిగూడ మండల అధ్యక్షులు ఎదిర రాజు మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకుల మాటలు దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టుగా ఉందని ముందు 6 గ్యారంటీల ముచ్చట తేల్చాలని, ఖరీఫ్ వచ్చిన యాసంగి రైతు భరోసాకు దిక్కు లేదని, మా నాయకులను విమర్శించే ముందు యాసంగి, ఖరీఫ్ రైతు భరోసా నిధులు రైతుల ఖాతాలలో జమ చేయాలని, 18 ఏళ్లు నిండిన మహిళలకు ఇస్తామన్న 2500 రూపాయల మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయాలని, పెంచుతామన్న పెన్షన్ ₹ 4000 డబ్బులు పెంచి సకాలంలో అవ్వతాతలకు అందించాలని, ప్రభుత్వం కౌలు రైతులకు ఇస్తామన్న 12 వేల రూపాయలు వెంటనే జమ చేయాలని సూచించారు. మీ ప్రభుత్వ తప్పిదాలను ఎండగట్టడం, మీ నాయకులను విమర్శించడం మాకు పెద్ద విషయం కాదని, మా పార్టీ మాకు సంస్కారం నేర్పించిందని అన్నారు. పర్వతాపూర్ సర్పంచ్ బోయ అశోక్ మాట్లాడుతూ, గ్రామాలలో సర్పంచులు గౌరవంగా తలెత్తుకొని తిరిగేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చూసుకుంటుందని, ప్రస్తుత సర్పంచుల ఆరు నెలల పదవీకాలంలో రాష్ట్ర ప్రభుత్వం నుండి ఒక్క రూపాయి కూడా గ్రామపంచాయతీ ఖాతాలలో జమ కాలేదని, వచ్చే ప్రతి పైసా కేంద్ర ప్రభుత్వం ద్వారానే వస్తుందని అన్నారు. అరుణమ్మ పై విమర్శలు చేసిన కాంగ్రెస్ నాయకుల గ్రామాలలో గ్రామపంచాయతీ ఖాతాల స్టేట్మెంట్లు చూసి మాట్లాడాలని అన్నారు. విమర్శలు చేయాలంటే మీకంటే ఎక్కువ చేయగలమని, వాస్తవాలను గ్రహించి మాట్లాడాలని, స్థాయిని మించి మాట్లాడకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సున్నాల అంజయ్య, చంద్ర శేఖర్ చారి, నరసింహారెడ్డి, యాదయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు..నిందితుడి అరెస్ట్

జయభేరి, మేడ్చల్ :




మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అత్వెల్లి కోర్టు సమీపంలో జరిగిన మంగళసూత్రం దోపిడి కేసును పోలీసులు ఛేదించి ఒక నిందితుడిని అరెస్ట్ చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం, మునీరాబాద్ గ్రామ పరిధిలోని ఓ ప్రైవేట్ కంపెనీలో కార్మికురాలిగా పని చేస్తున్న పాతూరి శుభరాణి మే 29, 2026న సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా, కోర్టు ప్రాంతం సమీపంలోని కల్వర్టు వద్ద ముగ్గురు వ్యక్తులు ఆమెను అడ్డగించారు. వారిలో ఒకరు ఆమె మెడలోని అర తులం బంగారు మంగళ సూత్రాన్ని లాక్కొని, ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. ఈ ఘటనపై బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సైబరాబాద్ కమిషనరేట్ అధికారులు, మేడ్చల్ జోన్ డీసీపీ, సీసీఎస్ డీసీపీ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

దర్యాప్తులో భాగంగా సంఘటన స్థలం పరిసరాలు, తూప్రాన్ వరకు వెళ్లే మార్గాల్లో సుమారు 100 నుంచి 120 సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ దృశ్యాల విశ్లేషణతో నిందితుల కదలికలను గుర్తించి వారిని ఛేధించారు. ఈ కేసులో మహారాష్ట్ర రాష్ట్రంలోని హింగోలీ జిల్లాకు చెందిన రూప్సింగ్ చతుర్సింగ్ తక్ (31)ను అరెస్ట్ చేయగా, షంషర్ సింగ్ పరారీలో ఉన్నాడు. నిందితుడి వద్ద నుంచి ఒక నకిలీ గొలుసు, ఏపీ03సీడబ్ల్యూ3964 నంబరు గల స్ప్లెండర్ బైక్, ఒక వివో మొబైల్ ఫోన్ను స్వాధీనం చేసుకున్నారు. జహీరాబాద్, బీదర్, హింగోలీ ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టిన అనంతరం జవహర్నగర్లో నిందితుడిని మేడ్చల్ క్రైమ్ టీమ్, సీసీఎస్, కుత్బుల్లాపూర్ జోన్ బృందాలు సంయుక్తంగా అదుపులోకి తీసుకున్నాయి. ఈ కేసును ఛేదించిన పోలీసు బృందాన్ని మేడ్చల్ జోన్ డీసీపీ ఎన్. కోటిరెడ్డి, సీసీఎస్ డీసీపీ ముత్యం రెడ్డి, ఏసీపీ శంకర్ రెడ్డి అభినందించారు. ప్రజలు నేరాల నివారణలో పోలీసులకు సహకరించాలని, వ్యాపార సంస్థలు అధిక నాణ్యత గల సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

## వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్

- అడ్వైజర్గా గందె వెంకన్న నియామకం
- గందె వెంకన్నను శాలువాతో సత్కరించిన బ్రాంచ్ సిబ్బంది



జయభేరి, పరకాల, జూన్ 12:

వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ పరకాల శాఖకు బ్రాంచ్ అడ్వైజర్ (శాఖ సలహాదారు) గా పరకాల పట్టణానికి చెందిన ప్రముఖ సామాజికవేత్త, బ్యాంకు ఖాతాదారుడు గందె వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. బ్యాంక్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు జూన్ 8వ తేదీన నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ నియామకం చేపట్టినట్లు బ్యాంక్ అధికారులు తెలిపారు. ఈ మేరకు బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎం.సత్యనారాయణ రావు జూన్ 10న అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం పరకాల శాఖలో నిర్వహించిన కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు గందె వెంకటేశ్వర్లును శాలువాతో ఘనంగా సత్కరించి, నియామక పత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ, గందె వెంకటేశ్వర్లుకు సమాజంలో ఉన్న విస్తృత పరిచయాలు, ప్రజల్లో ఉన్న మంచి పేరు ప్రతిష్టలు, బ్యాంకింగ్ రంగంపై ఉన్న అవగాహన బ్యాంక్ అభివృద్ధికి ఎంతో దోహదపడతాయన్నారు. పరకాల పట్టణ ప్రముఖ క్షేత్రమైన శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానానికి నాలుగు పర్యాయాలు చైర్మన్గా, వైశ్య సంఘం కోశాధికారిగా, ఆర్య వైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా, పరకాల మండల ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆయన పొందిన సుదీర్ఘ అనుభవం బ్యాంక్కు మంచి శుభ పరిణామం అని అభిప్రాయపడ్డారు. బ్రాంచ్ అడ్వైజర్ పదవి పూర్తిగా గౌరవప్రదమైన హానరరీ హోదా అని ఆయన వివరించారు. బ్రాంచ్ అడ్వైజర్గా గందె వెంకటేశ్వర్లు కస్టమర్ సేవల మెరుగుదలకు సూచనలు అందించడం, బ్యాంకింగ్ సేవలను మరింత విస్తరించడం, స్థానిక వ్యాపారులు, రైతులు, మహిళా సంఘాలతో బ్యాంక్ సంబంధాలను బలోపేతం చేయడం, ప్రజల అవసరాలకు అనుగుణంగా శాఖ కార్యకలాపాలపై మార్గదర్శకత్వం వహించడం వంటి బాధ్యతలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరకాల ప్రాంత అభివృద్ధిలో బ్యాంక్ పాత్రను మరింత పెంపొందించడంలో, ప్రజలకు బ్యాంకింగ్ సేవలను చేరువ చేయడంలో వెంకటేశ్వర్లు అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని బ్యాంక్ యాజమాన్యం విశ్వాసం వ్యక్తం చేసింది. ఈ నియామకం పరకాల శాఖ అభివృద్ధికి, ఖాతాదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేసినారు. బ్రాంచ్ హెడ్, సిబ్బందితో సమన్వయంతో పనిచేస్తూ, బ్యాంక్ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేయడానికి మీ శాయశక్తులా కృషి చేస్తారని భావిస్తున్నాను. మరొకసారి ఈ గొప్ప అవకాశం వచ్చిన మీకు నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు.

## ఫలహారాలతో వాసవి మాతకు పంచామృతాభిషేకం



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్రలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం 33 రకాల ఫలహారాలతో, 33 రకాల పూలతో పంచామృతాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ప్రచార అర్చకుడు సుకన్య హరిశంకర శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని సాంప్రదాయ రీతిలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. జేష్ట అధిక ఆషాడ మాసం సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 33 అమ్మవార్లకు ఒడిబియ్యం నింపే కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణి, మహిళా సంఘం సభ్యులు భక్తులు, భక్తులు తదితరులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



## తొర్రూరు డిఎంగా ప్రసూన లక్ష్మి బాధ్యతలు స్వీకరణ

జయభేరి, తొర్రూరు, జూన్12 :

తొర్రూరు ఆర్టీసీ డిఎం గా కె. ప్రసూన లక్ష్మి నియమితులయ్యారు .ఈ మేరకు ఆర్టీసీ ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో డిఎం గా ప్రసూన లక్ష్మీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డిఎం గా పనిచేసిన పద్మావతి తార్నాక ఆర్టీసీ ఆసుపత్రి పిఒగా బదిలీపై వెళ్లారు. నూతన డిఎంకు సహచర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిఎం మాట్లాడుతూ.... ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేస్తానని, డిపో ఆదాయం పెంచేందుకు సిబ్బంది సహకారం అందించాలని కోరారు. డిమాండ్ ను బట్టి అన్ని ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తొర్రూరు డిపోను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు.

## హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయి టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ

- ముఖ్య అతిథిగా హాజరైన ఏఐసీసీ ఇంచార్జి సెక్రటరీ సచిన్ సావంత్,మంత్రి పొన్నం ప్రభాకర్

జయభేరి, హుస్నాబాద్ :

ఈ కార్యక్రమంలో పాల్గొన్న పీసీసీ ఇన్సూరెన్స్ విభాగం చైర్మన్ పవన్ మల్లాది,మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్, 7 మండలాల అధ్యక్షులు,మార్కెట్ కమిటీ చైర్మన్ లు, వైస్ చైర్మన్ లు, కౌన్సిలర్లు, ఇతర ముఖ్య నేతలు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. 2002 లో ఓటర్ల సవరణ కార్యక్రమం జరిగినపుడు అర్హత ఉండి ఏ ఒక్క ఓటు మిస్ కావద్దు అని ఎన్నికల కమిషన్ అప్పటి ప్రభుత్వాలు భావించాయి. ఓటరు సవరణ ఉదేశ్యం బీజేపీ కి వ్యతిరేకంగా ఉన్న ఓటు హక్కు తొలగించాలని ఆలోచన తో ఉంది దాని ద్వారా రాజాకి లబ్ది పొందాలని భావిస్తుంది ఏ ఒక్క అర్హత ఉన్న ఓటు తొలగించకుండా మనం జాగ్రత్తగా ఉండాలి.

మీ బూత్ లలో ఏ ఒక్క ఓటు పోకుండా చూసుకునే బాధ్యత మన బిఎల్ ఎ లది. ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు మూలస్తంభం. ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం అత్యంత కీలకం. బూత్ లెవల్ ఏజెంట్లు బిఎ ఏలు ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో కీలక పాత్ర పోషించాలి వారి పని పారదర్శకంగా బాధ్యతాయుతంగా ఉండాలి. ఓటరు జాబితాలో కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, ఇతర సవరణలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖచ్చితమైన సమాచారాన్ని అందించాలి. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఓటరు నమోదు, సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించాలి. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరు జాబితా ఖచ్చితత్వం అత్యంత ముఖ్యమైనది. ప్రతి అర్హుడికి ఓటు హక్కు అందేలా ప్రతి బిఎల్ ఏ బాధ్యతతో పనిచేసి ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలి.

# ట్రాఫిక్ రహిత సమాజం కోసం రాజీ లేని కృషి చేస్తాం

**జయభేరి, శేరిలింగంపల్లి :**



ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామరం వరకు వయా ఎల్లమ్మబండ ప్రధాన రహదారి 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులలో వేగం పెంచాలి PAC చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామరం వరకు చేపడుతున్న వయా ఎల్లమ్మ బండ ప్రధాన రహదారిలో జరుగుతున్న 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులను తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి పరిశీలించిన PAC చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా PAC చైర్మన్ గాంధీ మాట్లాడుతూ.. ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజుల రామరం వెళ్లే రోడ్డు వయా ఎల్లమ్మబండ రోడ్డు నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు అని, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై 100 ఫీట్ రోడ్డు విస్తరణ చేపట్టడం జరిగినది అని, దానిలో భాగంగా తీసుకోవాల్సిన చర్యల పై గతంలో అధికారులతో కలిసి ఉషముళ్ళపూడి కమాన్ నుండి సిక్కుల బస్తీ వరకు పాదయాత్ర గా స్వయంగా నడుచుకుంటూ వెళ్లడం జరిగిన సంగతి విదితమే అని PAC చైర్మన్ గాంధీ తెలియచేసారు. 100 ఫీట్ రోడ్డు విస్తరణలో ఉన్న అడ్డంకులను తొలగిస్తూ తీసుకోవాల్సిన చర్యల పై చర్చించి, ప్రణాళిక ను రూపొందించి రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, రోడ్డు మధ్యలో వచ్చిన బండ రాళ్ళ ను తొలగించడం జరుగుతుంది అని, రోడ్డు విస్తరణ పనుల వలన మంచి నీటి పైప్ లైన్ పగిలిపోవడం జరిగినది అని, మంచి నీటి పైప్ లైన్ పనులు వెంటనే పునరుద్ధరణ చేపట్టడం జరిగినది అని, రోడ్డు విస్తరణలో అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం జరిగినది అని PAC చైర్మన్ గాంధీ తెలియచేసారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని, రోడ్డు విస్తరణ పనులు యుద్ధప్రాతిపదికన రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని, రోడ్డు విభాగిని పనులు నాణ్యత ప్రమాణాలు తో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని, నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, అధికారులను PAC చైర్మన్ గాంధీ అదేశించడం జరిగినది. ఉషముళ్ళపూడి కమాన్ నుండి సిక్కుల బస్తి వరకు ఎల్లమ్మ బండ రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు పక్కన గల విద్యుత్ స్థంబాలను స్థాన భ్రంశం చేపట్టడం జరిగినది అని, అదేవిధంగా రోడ్డు డివైడర్ మధ్యలో సుందరికరణ పనులు చేపట్టాలని. ఎల్లమ్మబండ రోడ్డు లో తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొంది కావున విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, రోడ్డుల విస్తరణ పనులు పై అధికారులకు పలు సూచనలు, సలహాలు తెలియచేయడం జరిగినది. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రోడ్డు మధ్యలో అడ్డంకిగా ఉన్న ఎలక్ట్రికల్ స్థంబాలను త్వరితగతిన స్థాన భ్రంశం చేయాలని, 100 ఫీట్ రోడ్డు విస్తరణ త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కల్గకుండా చూడాలని, ఈ 100 ఫీట్ రోడ్డు విస్తరణ వలన ప్రజలకు సమయం, ఇంధనం ఆదా అవుతుంది అని, మౌలిక వసతుల కల్పనలో అలసత్వం ప్రదర్శించకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని PAC చైర్మన్ గాంధీ గారు అధికారులను ఆదేశించడం జరిగినది. ట్రాఫిక్ సమస్య నివారణకై, నాణ్యమైన, మన్నిక గల రోడ్లను నిర్మిస్తామని, ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని PAC చైర్మన్ గాంధీ చెప్పడం జరిగినది. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని, ప్రజలకు రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుంది అని PAC చైర్మన్ గాంధీ చెప్పడం జరిగినది. 100 ఫీట్ రోడ్డు విస్తరణ పై అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగినది అని, ఏ చిన్న సమస్య అయిన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని PAC చైర్మన్ గాంధీ తెలియచేశారు. అదేవిధంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని, అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని, మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని PAC చైర్మన్ గాంధీ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## పారిశుధ్యం నివారణకు చర్యలు చేపట్టాలి

- అభివృద్ధిలో ఆదర్శ వార్డుగా మారుస్తా.. కౌన్సిలర్ విరమోని అంజి గౌడ్

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ 18వ వార్డులో పారిశుధ్య నివారణకు చర్యలు చేపట్టాలి 18వ వార్డు కౌన్సిలర్ విరామోని అంజి గౌడ్ అధికారులను కోరారు. దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో పారిశుధ్యం పనులను చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... వర్ష కాలం దృష్ట ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన కోరారు.మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.అభివృద్ధిలో ఆదర్శ 18వ వార్డును మారుస్తా అని కౌన్సిలర్ అంజి గౌడ్ తెలియజేసినారు. పారిశుధ్య నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు.

## 2వ వార్డు కౌన్సిలర్ పొట్ట మురళి జన్మదిన వేడుకలు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలో మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ పొట్ట మురళి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దేవరకొండ మున్సిపాలిటీ 18వ వార్డు కౌన్సిలర్ విరమోని అంజి గౌడ్ పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ, కౌన్సిలర్లు పొట్ట మధు,పులిజాల జానీ, రమావత్ రమేష్, అందుగుల సైదులు, అంబటి లోకేష్, చాట్ల ప్రశాంత్,ఎర్ర రాజు, లక్ష్మణ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## జాటావత్ నవీన్ నాయక్ జన్మదిన వేడుకల్లో కేతావత్ భిల్యా నాయక్



**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి మండల పరిధిలోని ప్రశాంత పూరి తండా కు చెందిన బిఆర్ఎస్ యువ నాయకుడు జాటావత్ నవీన్ నాయక్ జన్మదినం సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భిల్యా నాయక్. ఈ కార్యక్రమంలో కిరణ్ నాయక్,వాంకుడోత్ రవి, వార్డు మెంబర్ సంతోష్‌నాయక్, హరిక్రిష్ణనాయక్,నాయుడు, నవీన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి

- గత నెల కుక్కల దాడిలో గాయపడిన అద్విక్ కుటుంబానికి న్యాయం చేయాలి



**జయభేరి, ఎల్బీనగర్ :**

ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని బి.యన్.రెడ్డి హస్తినాపురం డివిజన్, విశ్వేశ్వర నగర్‌లో కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన చిన్నారి అద్విక్ కుటుంబ సభ్యులను బీజేపీ నాయకులు సామ రంగారెడ్డి, మాజీ కార్పొరేటర్లు లచ్చి రెడ్డి, బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, నాయికోటి పవన్, హస్తినాపురం డివిజన్ అధ్యక్షులు ఎరుకల మల్లేష్ గౌడ్ పరామర్శించి, చిన్నారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎల్బీనగర్‌లోని కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అద్విక్ వైద్య చికిత్స ఖర్చు ₹11,85,503.79కు చేరుకున్న నేపథ్యంలో, ఘటన జరిగిన సమయంలో ప్రభుత్వం ప్రకటించిన హామీ మేరకు మొత్తం వైద్య ఖర్చును వెంటనే విడుదల చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆసుపత్రి బిల్లుల భారంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోన్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో (IAS) దృష్టికి తీసుకెళ్లగా, సంబంధిత అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అద్విక్ త్వరగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని, అలాగే అతని విద్యాభ్యాసానికి ప్రభుత్వం అవసరమైన సహాయ సహకారాలు అందించాలని బీజేపీ నాయకులు కోరారు.



## స్థానిక ప్రజల తరపున ఉప్పల్ జోన్ జోనల్ కమిషనర్ కు వినతిపత్రం

- ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) చొరవతో బీరప్పగడ్డ డివిజన్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారుల వేగవంతమైన స్పందన

**జయభేరి, ఉప్పల్ :**

బీరప్పగడ్డ డివిజన్ పరిధిలోని పిస్తా హౌస్ నుండి ఉప్పల్ మండే మార్కెట్ వరకు ఉన్న ప్రధాన రహదారిపై ట్రాఫిక్ భద్రత, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు, దెబ్బతిన్న మ్యాన్‌హోల్స్ మరమ్మతులు, గుంతల పూడ్చివేత, పాఠశాల విద్యార్థుల భద్రతకు సంబంధించిన సమస్యలపై ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) స్థానిక ప్రజల తరపున ఉప్పల్ జోన్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తాని కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో వేలాది మంది విద్యార్థులు ఈ మార్గంలో ప్రయాణిస్తున్నారని, ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ ట్రాఫిక్ మళ్లింపు కారణంగా రహదారిపై వాహనాల రద్దీ పెరిగి ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే వర్షాకాలం కారణంగా ఏర్పడిన గుంతలు, దెబ్బతిన్న మ్యాన్‌హోల్స్, అధిక వేగంతో వెళ్తున్న వాహనాల వల్ల స్థానిక ప్రజలు మరియు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని వివరించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జోనల్ కమిషనర్ రాధికా గుప్తా సమస్యల తీవ్రతను గుర్తించి వెంటనే సానుకూలంగా స్పందించి సంబంధిత ఇంజినీరింగ్ విభాగ అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు బీరప్పగడ్డ డివిజన్ అసిస్టెంట్ ఇంజినీర్ రాజ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) సమక్షంలో సంబంధిత ప్రాంతాలను సందర్శించి పరిశీలించారు. రహదారిపై ఉన్న గుంతలు, దెబ్బతిన్న మ్యాన్‌హోల్స్, వర్షపు నీటి నిల్వలు మరియు విద్యార్థుల రాకపోకలకు సంబంధించిన సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా అవసరమైన ప్రాంతాల్లో రంబుల్ స్ట్రిప్స్ (స్పీడ్ బ్రేకర్లు) ఏర్పాటు, గుంతల పూడ్చివేత, మ్యాన్‌హోల్ మరమ్మతులు, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, విద్యార్థుల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) మాట్లాడుతూ, ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ ఎం. పరమేశ్వర్ రెడ్డి ప్రోత్సాహం, మార్గదర్శకత్వం, సహకారం ఎల్లప్పుడూ ప్రజా సమస్యల పరిష్కారానికి దోహదపడుతున్నాయని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంలో ఆయన నిరంతరం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు. అలాగే సమస్యపై వెంటనే స్పందించి ఆదేశాలు జారీ చేసిన జోనల్ కమిషనర్ రాధికా గుప్తాకి, క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించిన ఏఈ రాజ్‌కుమార్ కి, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్ కి స్థానిక ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మొహ్సిన్, ఆసిఫ్, పవన్, కిట్టు, దత్తు, వివిధ పాఠశాలల ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

# 10 వార్డులో గంటలో మారిన దృశ్యం

- సర్పంచ్, వార్డు సభ్యుడికి స్థానికుల కృతజ్ఞతలు

**జయభేరి, కొండమల్లేపల్లి :**



ప్రజాప్రతినిధుల చొరవతో గంటలోనే అద్భుతాలు సృష్టించవచ్చని నిరూపించారు కొండమల్లేపల్లి సర్పంచ్ యుగేందర్ రెడ్డి, 10వ వార్డు సభ్యుడు బిజిలి లింగం. సర్పంచి దృష్టికి తీసుకెళ్లిన మరుక్షణమే స్పందించి మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో రైస్ మిల్లు వెనక భాగాన ఏళ్లుగా చెత్తాచెదారంతో నిండిన స్థలం గంట వ్యవధిలోనే శుభ్రంగా మారిపోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 10 గంటల వరకు 10వ వార్డు పరిధిలోని ఈ ప్రాంతమంతా భయానకంగా ఉండేది. రైస్ మిల్లు వెనక ఖాళీ స్థలంలో చెత్త కుప్పలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, నిలిచిన మురుగునీటితో దుర్వాసన గుప్పుమనేది. పందులు సంచరిస్తూ, దోమలు స్వైర విహారం చేస్తుండేవి. పక్కనే ఉన్న ఇళ్లలోకి, షాపుల్లోకి దుర్వాసన వస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడేవారు.

సర్పంచ్ యుగేందర్ రెడ్డి, 10వ వార్డు సభ్యుడు బిజిలి లింగం ఆదేశాలతో జేసీబీలు, ట్రాక్టర్లు రంగంలోకి దిగాయి. ఉదయం 11 గంటల కల్లా చెత్త మొత్తం తొలగించి, మురుగునీటిని పారించి, స్థలాన్ని చదును చేశారు. ఇప్పుడు అదే స్థలంలో స్వచ్ఛమైన గాలి పీల్చుకోవచ్చు. దేవరకొండ రోడ్డు కొత్త శోభ సంతరించుకుంది. పబ్లిక్, వాహనదారులు హాయిగా తిరుగుతున్నారు. స్థానికుల స్పందన గంట క్రితం ఇక్కడ నిలబడాలంటేనే ముక్కు మూసుకునేవాళ్లం. ఇప్పుడు అదే స్థలం చూడముచ్చటగా ఉంది. మా 10వ వార్డుకు ఇది కొత్త ఊపిరి. సర్పంచ్ యుగేందర్ రెడ్డికి, మా వార్డు మెంబర్ బిజిలి లింగంకి మా కృతజ్ఞతలు అని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు ప్రజాప్రతినిధుల మాటల్లో ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలు శుభ్రంగా ఉండాలి. 10వ వార్డు ప్రజల సమస్య మా దృష్టికి వచ్చిన వెంటనే పనులు మొదలుపెట్టాం. ఇది మా బాధ్యత అని సర్పంచ్ యుగేందర్ రెడ్డి, వార్డు సభ్యుడు బిజిలి లింగం తెలిపారు. గంట క్రితం 10వ వార్డులో దేవరకొండ రోడ్డు రైస్ మిల్లు వెనక చెత్తాచెదారంతో, నిలిచిన మురుగునీటితో దుర్భరంగా ఉన్న ఖాళీ స్థలం గంట తర్వాత సర్పంచ్ యుగేందర్ రెడ్డి, 10వ వార్డు సభ్యుడు బిజిలి లింగం చొరవతో శుభ్రం చేసి చదును చేసిన అనంతరం అదే స్థలం. గంటలోనే ప్రాంత రూపురేఖలు మార్చేసిన పాలకులకు ప్రజలు ఫిదా.



# సప్లై చైన్ వ్యవస్థకు వెన్నుముకలాంటి వారు ఆర్యవైశ్యులు

- తెలంగాణ సమాజంలో, ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి
- ఘనంగా ఆర్యవైశ్య ప్రజాప్రతినిధులకు అభినందన సత్కారం

**జయభేరి, ఎల్బీనగర్ :**






తెలంగాణ సమాజం, ఆర్థిక వ్యవస్థలో ఆర్యవైశ్యుల పాత్ర అనన్య సామాన్యమైనదని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతంలోని కిరాణాదుకాణం నుంచి మహానగరాల్లో భారీ పరిశ్రమలు నడిపే దాకా తమదైన పాత్ర పోషిస్తూ...... సప్లై చైన్ కు వారు వెన్నుముకలా నిలుస్తున్నారని చెప్పారు. హైదరాబాద్ చంపాపేట్ లో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో అభినందన సత్కారం, సంఘం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి టీజీ వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యే బీగాల గణేశ్ గుప్తా, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణతో కలిసి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. రాష్ట్రంలో మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన ఆర్యవైశ్యులను ఈ సందర్భంగా సన్మానించారు. అనంతరం, ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం జరిగింది. ఎన్నికైన ప్రజాప్రతినిధులంతా ప్రజాసేవను గొప్పవరంగా భావించాలని ఎమ్మెల్యే సూచించారు. వ్యాపార ధర్మం పాటించటంలో, లాభాలను సమాజ శ్రేయస్సుకు వెచ్చించటంలో ఆర్యవైశ్యులు ముందుటారని మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. పన్నుల రూపంలో భారీ ఆదాయాన్ని సమకూరుస్తూ, రాష్ట్ర సంక్షేమ పథకాల అమలుకు పరోక్షంగా అందిస్తున్న తోడ్పాటును ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఆర్యవైశ్యుల్లోనూ అనేక మంది పేదలున్నారని... వారి సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.

